
### పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే
## సీజనల్ వ్యాధులు దరిచేరవు




2

# నవభూమి వరంగల్

అనుబంధం

27 సెప్టెంబర్,2024 శుక్రవారం పేజీలు:3

www.epaper.navabhoomi.in


## దీర్ఘకాలికంగా ఉండేలా మేడారం జాతర పనులు



2

# సిపిఎంపార్టీ ప్రథమ మహాసభ

- సిపిఎం పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షమే ఇకనుంచి ప్రజా సమస్యలపై నూతన పోరాటాలు
- సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పోలం రాజేందర్
- ఏచూరి లేని లోటు భారత సమాజానికి తీరని లోటు
- సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిలు

**కాటారం సెప్టెంబర్ 26 నవభూమి ప్రతినిధి:** భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ సిపిఎం పార్టీ కాటారం మండల కమిటీ ఆధ్వర్యంలో కాటారం మండల కేంద్రంలో గురువారం రోజున మండల ప్రథమ మహాసభను బొడ్డు స్మరణ్ అధ్యక్షతన జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి సంతాపం ప్రకటించి అనంతరం మహాసభ ను నిర్వహించుకోవడం జరిగింది. ఈ మహాసభకు పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిల్, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పోలం రాజేందర్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి బంధు సాయిలు,పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పోలం రాజేందర్ లు మాట్లాడుతూ సీతారాం ఏచూరి గారు 1974 నుంచి 2024 వరకు పేదల పక్షాన నిలబడ్డ వామపక్ష సూర్యుడని అన్నారు.ఏచూరి గారు యూపీఏ వన్ ప్రభుత్వంలో కీలకపాత్రను పోషించారని అదే విధంగా నేపాల్ ప్రభుత్వ ఏర్పాటులో కీలకపాత్రను పోషించాడని ఇలా చెప్పుకుంటూ పోతే ఒక ఆర్థిక వేత్తగా, రాజకీయ వేత్తగా దేశానికి ఎనలేని సేవలు అందించిన వ్యక్తి ఏచూరి అని,ఆయన మరణాంతరం కూడా ప్రజలకు ఉపయోగపడే వైద్య విద్యార్థులకు ప్రయోజనం ఉండాలని తన దేహాన్ని కూడా ఏవిన్స్ హాస్పిటల్ కి దానం చేసిన గొప్ప వ్యక్తిని సిపిఎం పార్టీ కోల్పోయిందని ఏచూరి లేని లోటు భారత సమాజానికి తీరనిదని ఏచూరి ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలియజేస్తూ సంతాపం తెలియజేశారు. అదే విధంగా మండలంలో ఈ మహాసభ జరుపు కోవడం సంతోషించదగ్గ విషయమని సిపిఎం పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షమేనని నిత్యం ప్రజాసమస్యల మీద పోరాటాలు నిర్వహిస్తూనే ఉందని పేర్కొన్నారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సింగరేణి లాంటి బొగ్గు గనుల వేలాన్ని ఆపాలని సింగరేణికి అప్పగించాలని ఎన్నో పోరాటాలను చేసిందని సిపిఎం పార్టీ నేతృత్వంలో ఎంతో మంది పేద ప్రజలకు భూపాలపల్లి పాత ఎర్ర చెరువులో గుడిసెలను వేసి ఎన్నో కష్టనష్టాలను ఓర్చుకొని ఉంటున్న ప్రజలకు ఇప్పటికీ అండగా ఉందని, అందుకే సిపిఎం పార్టీ ప్రజల కడుపు నింపేందుకే పోరాటాలు చేస్తుందని సిపిఎం పార్టీ ఎప్పుడు పేద ప్రజల పక్షాన్నే నిలబడుతుందని ఈ మహాసభ నుంచి కాటారం మండలంలో ప్రజా సమస్యలపై నూతన పోరాటాల వరువడిని సృష్టించి పార్టీని బలోపేతం చేస్తామని అన్నారు.అంతేకాక ప్రజల కోసం



పోరాటాలను చేసేందుకు కొన్ని నిర్ణయాలు చేశామని ముఖ్యంగా కాటారం మండలంలో పేదలుగా ఉన్నటువంటి వారిని గుర్తించి అర్హులైన వారికి ప్రభుత్వ ఇళ్ల స్థలాలను కేటాయించాలని, వాటికి పట్టాలనివ్వాలని,అదే విధంగా భూపాలపల్లి లో పేద ప్రజలు వేసుకున్న గుడిసె లకు ప్రభుత్వం వెంటనే పట్టాలిచ్చి ఆదుకోవాలని, అదే విధంగా కాటారంలో కిరాయలకు ఉంటూ రెంట్ కట్టలేక చిన్నాచితక కూలి చేసుకొని బ్రతుకుతున్న పేద ప్రజలకు తక్షణం ప్రభుత్వం ఇల్లు ఇవ్వాలని, రేషన్ కార్డులను తక్షణమే జారీ చేయాలని,కాటారం మండలంలో రుణమాఫీ జరగని రైతాంగానికి ఎటువంటి ఆంక్షలు లేని నిబంధనలతో రుణమాఫీ ఇవ్వాలని,ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా పేద ప్రజలకు దక్కే విధంగా చూడాలని, కాటారం మండల కేంద్రంగా కలెక్టర్ లాంటి ఆఫీసులో ప్రాతినిధ్యం ఉంది కాబట్టి యువకుల కోసం మినీ స్టేడియం, క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని, పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు దూర ప్రాంతాలకు పోయి చదువు కోవడం కోసం వారెన్నో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని,విద్యార్థుల కోసం కాటారం మండల కేంద్రంగా ఎస్సీ ,బీసీ ఎస్ఎంఎస్ హాస్టల్ ను ఏర్పాటు చేయాలని, గృహలక్ష్మిని తక్షణమే అమలు చేయాలని,మండల కేంద్రంలో బెల్ట్ షాపుల నిర్మూలన చేసి అటువైపు దారి మల్లుతున్న యువకులను కాపాడే విధంగా యువకుల్లో అధ్యయనాన్ని పెంచే విధంగా కాటారం మండల కేంద్రంగా చల్లగరిగ లాంటి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని,వీటి ఏర్పాటు కు పార్టీ పోరాటాలను నిర్మించే విధంగా నిర్ణయాలను చేశామని ఈ మహాసభ నుండి సీతారాం ఏచూరి ఆశ స్ఫూర్తిని కొనసాగిస్తూ విద్యార్థి యువజన కార్మిక శ్రామిక రైతాంగ ప్రజల సమస్యలపై నూతన కార్యక్రమాలను రూపొందిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేసే విధంగా కార్యక్రమాలు ఉంటాయని,మండల కేంద్రంలో ఉండే అటువంటి సమస్యలను తక్షణమే సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు పరిష్కరించాలని,ఈ రోజు నుంచి సిపిఎం పార్టీ నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్,మండల కమిటీ సభ్యులు ఇస్నమ్మ , మహేందర్, బొడ్డు స్మరణ,మల్లేశ్వరి, బొడ్డు కిషోర్ లతో పాటు పార్టీ శాఖ కార్యదర్శులు శాఖ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**బహుజన పోరు బిడ్డ చాకలి ఐలమ్మ**

**రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 129వ జయంతి వేడుకలు**



**కాటారం,సెప్టెంబర్ 26 నవభూమి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రం లో గురువారం ఉదయం కాటారం రజక సంఘం ఆద్వర్యంలో గారెపల్లి చౌరస్తా లో గల చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బహుజన పోరు బిడ్డ, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని కాటారం మండల రజక సంఘం నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు పెనుగొండ రాజయ్య మాట్లాడుతూ నిజాం నిరంకుశానికి వ్యతిరేకంగా పోరాటం సాగించిన చాకలి ఐలమ్మ స్ఫూర్తిని నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.రజక వృత్తి లోని పేద,బడుగు,బలహీన వర్గాలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వా లు ఇంకా సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో పైడాకుల సతీష్, పైడాకుల మహేందర్,నడికుట లింగయ్య, మూసాపూర్ ఐలయ్య,కల్లగుంట సురేష్ బాబు, గుండ్లపెల్లి హరీష్,అశోక్,కనుకుల పవన్,పున్నం శంకర్,పెనుగొండ శ్రీను,పున్నం రమేష్,పెనుగొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**1,23,690/- రూపాయలు మంజూరు చేయించిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క**

**కాటారం,సెప్టెంబర్ 26 నవభూమి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ఇబ్రహీంపల్లి గ్రామానికి చెందిన కుడుదుల కృష్ణస్వామి చిన్న పాప అనారోగ్యానికి గురై,ఆర్థిక భారాన్ని మోయలేక వారి పరిస్థితిని తెలంగాణ వెంకటేశ్వర్ రావు కు తెలుపారు.వెంకటేశ్వర్ రావు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన డిప్యూటి సీఎం సిఎం రిలీఫ్ ఫండ్ కింద ఒక లక్ష ఇరువది మూడు వేల ఆరు వందల తొంబాధి రూపాయలు మంజూరు చేయించారు.గురువారం రోజున 1,23,690/- రూపాయల చెక్కును తెలంగాణ వెంకటేశ్వర్ రావు,కూర శ్రీనివాస్ పటేల్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు తెలంగాణ వెంకటేశ్వర్ రావు ,డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క లకు ధన్యవాదాలు తెలియజేశారు.



### పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే

# సీజనల్ వ్యాధులు దరిచేరవు

- కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్.మౌనిక
- ప్రతాపగిరి గ్రామంలో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం
- స్వచ్ఛత హి సేవ కార్యక్రమం పై అవగాహన








**కాటారం,సెప్టెంబర్ 26 నవభూమి ప్రతినిధి:** కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల ప్రతాపగిరి గ్రామంలో గురువారం రోజున ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేసారు.పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,మురికి గుంటలలో నీరు నిలువ లేకుండ చూసుకోవాలని,దోమలు రాకుండా మెస్ డోర్ లు పెట్టుకోవాలని,సీజనల్ వ్యాధులు డెంగ్యూ,మలేరియా,కలరా,చికెన్ గున్యా,టైఫాయిడ్ లాంటి వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో కొబ్బరి బోండాలు,ప్లాస్టిక్ కవర్లు, పాత టైర్లు,లేకుండా ఎప్పటి కప్పుడు శుభ్రం చేసు కోవాలని తెలిపారు.వారంలో శుక్ర,మంగళ వారాలు డ్రై డే కార్య క్రమాలు నిర్వహించాలని సూచించారు.త్రాగు నీటిని కాచి వడబోసిన తర్వాతనే త్రాగాలని,జ్వరం వచ్చిన వెంటనే ఆరోగ్య కార్యకర్తను గాని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను గాని సంప్రదించాలని సూచించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో అన్ని రకాల జ్వరాలకు రక్త పరీక్షలు ఉచితంగానే చేయ బడుతాయని, ప్రజలందరూ ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో బాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.స్వచ్ఛత హి సేవ పక్షోత్సవాల సంధర్భంగా గ్రామంలో డ్రై డే నిర్వహించి,ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఏంఎల్‌ఏచ్ పి డాక్టర్.తిరుపతి రెడ్డి,హెల్త్ అసిస్టెంట్ సమ్మయ్య,గ్రామ పంచాయతీ కార్యదర్శి శంకర్, ఆశా వర్కర్ స్వరూప,గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

### దీర్ఘకాలికంగా ఉండేలా మేడారం

# జాతర పనులు

**ములుగు, –నవభూమి:** మేడారం జాతరలో చేపట్టే పనులు దీర్ఘకాలికంగా ఉపయోగపడే విధంగా ఉండాలని మంత్రి సీతక్క అన్నారు.బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో మినీ మేడారం జాతర నిర్వహణపై కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ శబరిష్, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్‌తో పాటు వివిధ శాఖల అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. రూ. వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్న అవి శాశ్వతంగా ఉండకపోవడంతో మళ్లీ ఆ పనులను చేపట్టే పరిస్థితి వస్తోందని, ఇప్పటి నుంచి చేపట్టే పనులు దీర్ఘకాలికంగా ఉండేలా చేయాలని అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం స్పర్శ్ పథకం ద్వారా జాతరకు నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు.ఫ్లోరింగ్ పనులతో పాటు మంచినీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు వసతులు కల్పించాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందని స్పష్టం చేశారు. జిల్లా అధికారులు గతంలో పని చేసిన అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. తాను స్థానిక ఎమ్మెల్యేగా జాతర అదనపు నిధులు కోసం కృషి చేస్తానని తెలిపారు.జిల్లాకు డైనమిక్ కలెక్టర్ రావడం జిల్లా ప్రజల అదృష్టమన్నారు. 2024 జాతర సమయంలో చేపట్టిన పనుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు కలెక్టర్‌లు సీహెచ్. మహేందర్‌జీ, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.అప్పయ్య, పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ, గిరిజన సంక్షేమం, నీటిపారుదల, విద్యుత్తు శాఖ అధికారులు పాల్గొన్నారు.



# పౌర సేవల్లో కమిషనరేట్ పోలీసులు భేష్



**వరంగల్-నవభూమి:** పౌరసేవలు అందించడంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ అధికారులు అవార్డులు అందుకున్నారు.పోలీస్ స్టేషన్లలోని సన్నిహిత కౌంటర్లలో పనిచేస్తున్న సిబ్బంది, ఠాణాల ద్వారా అందిస్తున్న సేవలు, ఫిర్యాదుల నిర్వహణ, పనితీరు మెరుపరుచుకోవడం తదితర అంశాలపై థర్డ్‌పార్టీ ద్వారా విచారణ జరిపి రాష్ట్ర ప్రభుత్వం పౌరసేవ పతకాలు ఇస్తుంది. జులై, ఆగస్టులో పౌరులకు ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఆత్మకూర్, చిల్పూర్ ఠాణాలకు, ఫిర్యాదుల నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేసిన శాయంపేట ఠాణా హెడ్‌కానిస్టేబుల్ బి.వెంకట్రామ్ నాయక్‌కు బుధవారం రాష్ట్ర డీజీపీ జితేందర్ హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డు అందించారు. ఉత్తమ పౌరసేవా పతకాలను ఆత్మకూర్ ఇన్‌స్పెక్టర్ సంతోష్, అప్పటి చిల్పూర్ ఎస్సై రాజేందర్ అందుకున్నారు. కమిషనరేట్ పరిధిలో రెండు ఠాణాలతో పాటు హెడ్‌కానిస్టేబుల్‌కు అవార్డు రావడం పట్ల సీపీ అంబర్ కిషోర్ ఝా హర్షం వ్యక్తం చేశారు.

# రైస్ మిల్లుపై పౌరసరఫరాలశాఖ టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు



**మహబూబాబాద్, -నవభూమి:** జిల్లా కేంద్రంలోని సాయి శ్రీనివాస ఇండస్ట్రీస్ రా పారా బాయిల్డ్ రైస్ రైస్‌మిల్‌లో బుధవారం సివిల్ సప్లైయి టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు.రికార్డుల ప్రకారం ఈ రైస్‌మిల్‌కు 88.96 క్వింటాళ్ల ధాన్యం సీఎంఆర్ ఇచ్చారని.. 20 వేల క్వింటాళ్ల ధాన్యం తక్కువగా ఉందని టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ ప్రభాకర్ తెలిపారు. రైస్ మిల్లుకు సంబంధించిన మరికొంత ధాన్యం వెంకటేశ్వర బిన్నీ రైస్ మిల్, శ్రీసాయి కాటన్ మిల్లులో నిల్వ ఉంచినట్లు యాజమానులు చెప్పడం వల్ల అక్కడ కూడా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్తిగా తనిఖీ చేసి తర్వాత చర్యలు తీసుకుంటామన్నారు.ఇప్పటి వరకు జిల్లాలో మూడు రైస్‌మిల్లులపై దాడులు నిర్వహించి ధాన్యం పక్కదారి పట్టించినవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు. ఈ మూడు మిల్లుల్లో సుమారు రూ. 24.55 కోట్ల విలువైన ధాన్యం పక్కదారి పట్టినట్లు తెలుస్తుందన్నారు. అధికారులు కృష్ణవేణి, ప్రేమ్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.

# మౌంట్ గొరీచెన్ పర్వతాన్ని అధిరోహించిన యశ్వంత్

**మరిపెడ-నవభూమి:** మహబూబాబాద్ జిల్లా మరిపెడకు చెందిన పర్వతారోహకుడు భూక్యా యశ్వంత్ ఇటీవల అరుణాచల్ ప్రదేశ్‌లోని మౌంట్ గొరీచెన్ పర్వతాన్ని అధిరోహించి మరో ఘనత సాధించారు.అతి పిన్న వయసులో ఈ ఘనత సాధించిన వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. మరిపెడ మండలం భూక్యాతండాకు చెందిన యశ్వంత్ పట్టుదల, కృషి, ఆసక్తితో ప్రపంచంలోని శిఖరాలను అధిరోహిస్తున్నారు. సెప్టెంబర్ 4న ప్రారంభించిన యాత్ర 6488 మీటర్ల ఎత్తైన శిఖరాన్ని 18 రోజుల్లో అధిరోహించి కిందకు దిగినట్లు యశ్వంత్ పేర్కొన్నారు. ఎవరెస్ట్ అధిరోహించాలనే సంకల్పంతో ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తున్నట్లు పేర్కొన్నారు. అసోం గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య యశ్వంత్‌కు అభినందనలు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సాహస అభిమానులు యశ్వంత్‌కు ఫోన్ ద్వారా అభినందనలు తెలిపారు.

# మాయదారి వాన.. అన్నదాత హైరానా!





**నర్సర్‌పేట, -నవభూమి:** జిల్లాలో బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. అప్పటి వరకు ఎండగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారడంతో అన్నదాతలు ఆగమాగమయ్యారు. నర్సంపేట వ్యవసాయ మార్కెట్లో ఆరబోసిన మొక్కజొన్నలు తడిసిపోయాయి. దిగుబడులను కాపాడుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. టార్పాలిన్లు కప్పేలోపు మక్కల రాశులు తడిసిపోయాయి. కొన్ని వరదకు కొట్టుకుపోయాయి.నేడో, రేపో తూకం వేయాల్సిన మక్కలు మాయదారి వానకు తడిసిపోవడంతో 'చేతికాడికి వచ్చిన ముద్ద చేజారినట్లు' అయ్యిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు.



నర్సంపేట మండలం పర్శునాయక్‌తండాకు చెందిన లాల్‌సింగ్ అనే రైతు మూడురోజుల క్రితం మక్కలు తెచ్చి ఆరబోయగా.. తూకం వేస్తారనుకునే సమయంలో వర్షం పడటంతో మక్కలన్నీ తడిసిపోయాయని వాపోయారు. బుచ్చునాయక్‌తండాకు చెందిన రైతు నాలుగు ఎకరాల్లో పండించిన పంటను అయిదురోజుల క్రిత్రం మార్కెట్‌కు తీసుకువచ్చారు. 16శాతం తేమ వస్తే సోమవారం తూకం వేయకుండా నిరాకరించారని.. అప్పుడే కొనుగోలు చేస్తే.. తడిసేవికావని కన్నీటిపర్యంతమయ్యారు.

# వర్షాల వేళ ఒడిసిపడదాం!

**డోర్నకల్, -నవభూమి:** దాహం వేసినప్పుడే ఆలోచిద్దామా..? ఇప్పుడు వర్షాలు పడుతున్నాయి..నీరంతా వృథాగా సముద్రం పాలవుతోంది.. కాంక్రీట్ వనంలో చుక్క నీరు కూడా ఇంకడం లేదు.. మళ్లీ వేసవి వచ్చేవరకు తాగునీటికి కటకటే.. అప్పుడు ఇంకుడు గుంతలు గుర్తుకొస్తాయి.. దాహం వేసినప్పుడే.. బావి తవ్వితే ప్రయోజనం ఉంటుందా..? మరేం చేద్దాం..! ఇదే తరుణం...తాజాగా వాన నీటిని ఒడిసిపట్టి.. భూగర్భ జలాల పెంపునకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ నడుం బిగించింది. అన్ని పురపాలికలు, నగరపాలక సంస్థల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, 300 చదరపు మీటర్లకు మించిన అన్ని నిర్మాణాల్లో ఇంకుడు గుంత ఉండాలని ఉత్తర్వులు వెలువరించింది.. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగంతో పాటు ఇటు పౌరులూ కదలాలి.భవనాల నిర్మాణాలకు అనుమతిచ్చేటప్పుడే ఇంకుడుగుంత ఉండేలా తప్పని చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ మేరకు విధివిధానాలను పొందుపర్చింది. ఇప్పటికే ఉన్న భవనాల్లోనూ నిర్మించాలి. విద్యా సంస్థలు ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, అపార్టుమెంట్లు, ప్రైవేటు వాణిజ్య భవనాల్లోనూ తప్పనిసరి. బడా భవనాలకు ఆక్యుపెన్సీ కమ్ కంప్లీషన్ సర్టిఫికెటు ఇచ్చే ముందు ఇంకుడుగుంత నిర్మించారో లేదో అధికారులు పరిశీలించాలి.పౌరుల మేలుకొలుపు కోసం..! నగర పాలక సంస్థతో పాటు పురపాలికల్లో పౌరుల మేలుకొలుపు కోసమన్నట్లు ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టారు. జల శక్తి అభియాన్ పథకం కింద 'క్యాచ్ ది రెయిన్' పిలుపుతో ఈ కార్యాచరణ అమలు చేశారు. డోర్నకల్‌లో మున్సిపల్ పాలకవర్గం, ఉద్యోగులు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు.

# కొనుగోళ్లకు సన్నద్ధం!



**జనగామ,-నవభూమి:** జిల్లాలో వానాకాలం వరి ధాన్యం కొనుగోలుకు సంబంధించి అధికారులు కసరత్తు పూర్తిచేశారు. జిల్లావ్యాప్తంగా ఈ సీజన్‌లో దిగుబడి అయ్యే ధాన్యం, సేకరణ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసే ధాన్యం, అందుకు తగ్గ ఏర్పాట్లకు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌ను అధికారులు ఇటీవల సిద్ధం చేసుకున్నారు. మరో 15 రోజుల నుంచి వానాకాలం వరి ?కోతలు ఊపందు కోనున్నందున అందుకు సంబంధించిన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం అయ్యారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, కేంద్రాల్లో అవసరమైన వసతుల కల్పన, నిర్వాహకులకు శిక్షణ వంటి అంశాలపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లు సజావుగా సాగేలా అధికారులు ప్లాన్ చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా మరో పది, పదిహేను రోజుల్లో వరి కోతలు ప్రారంభం అవుతుండడంతో కొనుగోలు ప్రక్రియను మొదలు పెట్టాలని యంత్రాంగం నిర్ణయించింది. జిల్లాలో గత వానాకాలం వచ్చిన దిగుబడి, సేకరణను బట్టి ఈ ఏడాది దిగుబడిని అంచనా వేసుకొని అందుకు తగ్గట్లుగా కొనుగోళ్ల కోసం ఏర్పాట్లు చేశారు.జిల్లావ్యాప్తంగా 180 కొనుగోలు కేంద్రాలు వానాకాలం వడ్ల కొనుగోలు కోసం జిల్లావ్యాప్తంగా 180 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. జిల్లాలోని 12 మండలాల పరిధిలో ఐకేపీ ఆధ్వర్యంలో 94, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 84, మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో 2 కేంద్రాలను తెరవనున్నారు. గత ఏడాది వానాకాలం సీజన్‌లో 177 కేంద్రాలను ఏర్పాటు చేయగా ఈ ఏడాది 180 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో 2.10 లక్ష ఎకరాల్లో వరి సాగు అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. కానీ ఈ సీజన్‌లో వరి సాగు విస్తీర్ణం కొంత మేర తగ్గింది. సాగు సమయంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడడంతో సాగుకు రైతులు పెద్దగా ముందుకు రాలేదు. దీంతో ఈ సీజన్‌లో కేవలం 1.50 లక్షల ఎకరాలకే వరి సాగు పరిమితమైనట్లు అధికారులు చెబుతున్నారు. కాగా.. ఈ సీజన్‌లో మొత్తంగా 4.74 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఇందులో 3.29 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డురకం, 1.45 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం వస్తుందని భావిస్తున్నారు. కాగా.. ఇందులో 2.05 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేస్తున్నారు. సన్నరకం ధాన్యాన్ని బియ్యం చేసి అమ్ముకునేందుకు రైతులు మొగ్గు చూపే అవకాశం ఉంది. దీంతో కొనుగోలు కేంద్రాలకు సన్నరకం ధాన్యం వచ్చే అవకాశం తక్కువేనని అధికారులు భావిస్తున్నారు. కాగా.. ఈ సీజన్ నుంచి సన్నరకం ధాన్యానికి రూ. 500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో రైతులు సన్నరకం ధాన్యాన్ని కేంద్రాల్లో అమ్ముకుంటారా.. మరాడించి బియ్యంగా మార్చి అమ్ముకుంటారా అన్నది చూడాలి.51.27 లక్షల గన్నీ సంచులు అవసరం ధాన్యం కొనుగోలు కోసం 51.27 లక్షల గన్నీ సంచులు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు. ఇందులో పాత గన్నీలు 23.58 లక్షలు కాగా కొత్తగా 27.68 లక్షల గన్నీలు అవసరం అవుతాయని భావిస్తున్నారు. కాగా.. ప్రస్తుతం 9.32 లక్షల గన్నీలు మార్కెటింగ్ శాఖ వద్ద అందుబాటులో ఉండగా మిల్లర్ల వద్ద ఉన్న మరో 41.94 లక్షల గన్నీలను తెప్పించనున్నా రు. దీనితో పాటు ధాన్యం కొనుగోలుకు 5400 టార్పాలిన్లు, 360 మాయిశ్చర్ మిషన్లు, 360 ఎలక్ట్రానిక్ కాంటాలు, 360 ప్యాడీ క్లీనర్లు అవసరం అవుతాయని అంచనా వేశారు.దసరా తర్వాత కేంద్రాల ప్రారంభం జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను దసరా తర్వాత ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నా రు. జిల్లాలో పలుచోట్ల ఎడగారు పంట కోతలు జరుగుతున్నాయి. ఈ ధాన్యాన్ని మార్కెట్లలో, మిల్లర్ల వద్ద రైతులు అమ్ముకుంటున్నారు. జిల్లా మొత్తంగా ఎడగారు ధాన్యం సుమారు 15 వేల మెట్రిక్ టన్ను లు దిగుబడి వస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఈ కోతలు మరో పది రోజుల్లో పూర్తి కాగా.. ఆ తర్వాత వానాకాలం కోతలు ప్రారంభం కానున్నాయి. దసరా తర్వాత కోతలు ఊపందుకోనున్నాయి. దీంతో దసరా పండగ తర్వాత కేంద్రాలను తెరవాలని అధికారులు ఆలోచనలో ఉన్నారు.సజావుగా ధాన్యం కొనుగోళ్లు రోహిత్‌సింగ్, అదనపు కలెక్టర్(రెవెన్యూ) కలెక్టర్, జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశాలతో జిల్లాలో వానాకాలం వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ప్రణాళికను సిద్ధం చేశాం. ఈ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కొనుగోళ్లు సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నాం.